

ప్రత్యేక భద్రత కల్పించాలి..

అన్ని వృత్తుల్లో అతి పవిత్రమైనది వైద్య వృత్తి. కనిపించే దైవంగా భావించే వైద్యులపై దాడులు జరగటం అమానుషం. వైద్యులపై దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవటంతో పాటు దాడులు జరగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలి. వైద్యులకు ప్రత్యేక భద్రత కల్పించాలి.

– డాక్టర్ వీర్ల నిఖిల్,
ఫిజియోథెరపిస్ట్ సత్యనారాయణపురం





నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి..

వైద్యులపై దాడులు, కోల్‌కతా వంటి ఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలి. ఆస్పత్రుల వద్ద పటిష్టమైన బందోబస్తు నిఘా ఏర్పాటు చేయాలి. దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. రాత్రి పూట విధులు నిర్వహించే మహిళలకు, వైద్య సిబ్బందికి ప్రత్యేక భద్రత కల్పించాలి.

–డాక్టర్ బి.వసంతకుమార్,
రిటైర్డ్ రైల్వే ఉద్యోగి

క్లుప్తంగా

ఎట్టకేలకు స్పందించిన అధికారులు



మధురానగర్ రైల్వేస్టేషన్ పరిసరాల్లో చెత్త తరలిస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్

మధురానగర్(విజయవాడ సెంట్రల్): ఎట్టకేలకు నగరపాలకసంస్థ అధికారులు స్పందించారు. మధురానగర్ రైల్వేస్టేషన్ పరిసరాలు అపరిశుభ్రంగా చెత్తచెదారంతో డంపింగ్ కేంద్రంగా మారింది. దీంతో స్థానికులు పడుతున్న అవస్థలపై సాక్షి దినపత్రికలో ఈ నెల 25వ తేదీ అధ్వానంగా మధురానగర్ రైల్వేస్టేషన్ పరిసరాలు శీర్షికన కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన అధికారులు బాబ్‌గేట్ సహాయంతో పరిసరాలు శుభ్రం చేసే పనులు ప్రారంభించారు. చెత్తచెదారాన్ని ట్రాక్టర్లలో తరలించారు. అలాగే రైల్వే స్టేషన్ వద్ద అనధికారికంగా పార్కింగ్ చేస్తున్న వాహనాలను తీయించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించటం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

శ్రీదత్తసాయి మందిరంలో ప్రత్యేక పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. మందిర వ్యవస్థాపకుడు తంగెళ్లమూడి వీర మోహనరావు బాబాకు ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. శ్రీ సాయి నక్షత్రమాలిక మండలి ఆధ్వర్యాన పారాయణం జరిగింది. మధ్యాహ్నం దాతల సహకారంతో 500 మందికి అన్నప్రసాద వితరణ జరిగింది.

అలరించిన సినీ సంగీత విభావరి



విజయవాడ కల్చరల్: స్వరరాగ తరంగిణి ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. గాయనీ గాయకులు పావని, జ్యోతి, విజయశ్రీ గుప్తా, జెస్సీ, డీ సుధ, డేవిడ్ రాజు, పి.శ్రీనివాస్, ఎం.జోషి, యువరాజ్, సాల్మన్, రామరాజు పలు తెలుగు హిందీ చిత్ర గీతాలను ఆలపించారు. సంస్థ వ్యవస్థాపకుడు ఇజ్రాయల్ మేకల మాట్లాడుతూ ప్రతీ నెల కార్యక్రమాలు నిర్వహించి, నూతన గాయనీ గాయకులకు అవకాశం కల్పిస్తామని తెలిపారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు గాయనీ గాయకులను అభినందించారు. గాయకులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

మత్తు పదార్థాల వినియోగం హానికరం



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న శేఖర్‌బాబు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): మత్తు పదార్థాల వినియోగం ఆరోగ్యానికి ఎంతో హానికరమని.. మత్తు పదార్థాలతో జీవితం చిద్రమౌతుందని నవజీవన్ బాలభవన్ ప్రోగ్రామ్ మేనేజర్ జి.శేఖర్‌బాబు అన్నారు. నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యాన సింగ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో 'మత్తు పదార్థాలు–సోషల్ మీడియా దుర్వినియోగం' అనే అంశంపై గురువారం వర్క్‌షాప్ నిర్వహించారు. దీనిలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కొన్ని సినిమాలు, సోషల్ మీడియాలో చూస్తున్న వీడియోల ద్వారా యువత మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారన్నారు. ఇది క్రమేపీ ప్రజారోగ్య సమస్యగా రూపుదాల్చుతోందన్నారు. సోషల్ మీడియా–మాదకద్రవ్య వ్యసనాన్ని అధిగమించడానికి డాక్టర్లు, కుటుంబ సభ్యులు, స్నేహితులు, సహాయక బృందాలు, వ్యవస్థీకృత చికిత్స సహాయం అవసరం అవుతుందన్నారు. నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్ యస్.దేవమణి మాట్లాడుతూ.. మానసిక వైద్యులు, సైకాలజిస్ట్‌చే ఉచితంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎవరైనా ఇటువంటి సమస్యలతో బాధపడుతుంటే 94904–92020 నెంబరుకు ఫోను చేసి ఉచితంగా సంప్రదించవచ్చని తెలిపారు. అంగన్ వాడీ ఏసీడీపీఓ జ్యోత్స్న, సింగ్‌నగర్ సెక్టార్ సూపర్‌వైజర్ వి.నాగమణి, సెక్టార్ విభాగాల అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



భారతీయ విద్యామందిర్‌లో చిన్నారులు



సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో..



విశ్రాంత తెలుగు అధ్యాపకులను సత్కరిస్తున్న శారద ప్రిన్సిపాల్స్ శ్రీధర్, నాగేశ్వరశర్మ



గిడుగు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జనార్దన్, తాడి శకుంతల తదితరులు

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

మధురానగర్(విజయవాడసెంట్రల్): నియోజకవర్గ వ్యాప్తంగా తెలుగు భాషా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రపంచ ప్రసిద్ధ భాషా శాస్త్రవేత్త, భాషా సంస్కర్త, వ్యవహారిక భాషోద్యమ నేత, కళాప్రపూర్ణ, గిడుగు వేంకట రామ్మూర్తిని జయంతి పురస్కరించుకుని తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. గిడుగు చిత్రపటాలకు పూలమాలలు వేసి ఆయన చేసిన సేవలను వక్తలు కొనియాడారు.

బీఆర్టీఎస్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన..

దుర్గాపురం గౌతమ పాఠశాలలో గురువారం బీఆర్టీఎస్ వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యాన తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ డెప్యూటీ గవర్నర్ డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని తెలుగు భాష విశిష్టతను వివరించారు. అనంతరం తెలుగు ఉపాధ్యాయులను సత్కరించారు. గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వాకర్స్ రీజియన్ కార్యదర్శి కొండాయగుంట రాము, వీరంకి గోకర్ణేశ్వర రావు, బండారు వెంకటేశ్వరావు, సీతారామయ్య పాల్గొన్నారు.

గురుకుల కళాశాలలో..

మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో తెలుగు భాషా దినోత్సవంలో భాగంగా అతిథి ఉపన్యాస కార్యక్రమం జరిగింది. ప్రసిద్ధ భాషా పరిశోధకులు, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ తెలుగుశాఖ పూర్వ అధ్యక్షుడు ఆచార్య నడుపల్లి శ్రీరామరాజు వర్చువల్‌గా గిడుగు రామ్మూర్తి భాషా దృక్పథం – మన కర్తవ్యం అనే అంశంపై ఉపన్యసించారు. అన్ని రంగాల్లో తెలుగు వాడుకను విస్తృతం చేయవలసిన బాధ్యతను ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారు స్వీకరించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా నిర్వహించిన పద్యధారణ, ప్రహేళిక పోటీల్లో విజేతలకు ప్రిన్సిపాల్ నీరజ బహుమతులు అందజేశారు.

శ్రీభారతీయ విద్యామందిర్‌లో..

లక్ష్మీనగర్ శ్రీ భారతీయ విద్యామందిర్‌లో వేడుకలు జరిగాయి. చిన్నారులు తెలుగు మాత, గిడుగు రామ్మూర్తి తదితర వేషధారణలతో తెలుగు ప్రాముఖ్యతను తెలియ చేసే విధంగా ప్రదర్శనలు చేశారు. పాఠశాల డీన్ షణత్‌కృష్ణ, ప్రిన్సిపాల్ స్వప్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాలలో..

మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె భాగ్యలక్ష్మి తెలుగు భాష గొప్పతనాన్ని వివరించారు.



దుర్గాపురంలో టీచర్లను సత్కరిస్తున్న నిర్వాహకులు

మాతృభాషతోనే మనో వికాసం

విజయవాడ కల్చరల్: మాతృభాషతోనే మనో వికాసం కలుగుతుందని కామ్రేడ్ జీఆర్‌కే పోలవరపు సాహితీ సమితి వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణ రావు అన్నారు. తెలుగు కళావాహిని ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీ, శ్రీ కళాభారతి, కామ్రేడ్ జీఆర్‌కే, పోలవరపు సాహితీ సమితి ఆధ్వర్యంలో తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రం వద్ద గురువారం గిడుగు రామ్మూర్తి జయంతి, తెలుగు భాషా దిన వేడుకలను నిర్వహించారు. నారాయణరావు మాట్లాడుతూ.. తెలుగులో మాట్లాడటం ఆత్మగౌరవానికి నిదర్శనమన్నారు. శ్రీ కళాభారతి వ్యవస్థాపకుడు శింగంశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆంగ్లంతో పాటు తెలుగు భాషకు సమాన గౌరవం ఇవ్వాలని సూచించారు. చింతకాయల చిట్టిబాబు ఆధ్వర్యంలో మాతృభాషా



భాషా పురస్కార గ్రహీతలతో గోళ్ల తదితరులు

వికాసానికి కృషి చేసిన సరకొండ రమాదేవి, నడకుదురు సుజాతమ్మ, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ రమేష్ దరిశిక, పీవీ నాంచార్య, కొంపెల్ల శ్రీనివాసరావు, బెజగం రవికుమార్, వీవీ రత్నం, జేవీ చలపతిరావు, కుప్పా కృష్ణవేణి, చింతా వెంకటేశ్వర్లుకు భాషా పురస్కారాలను అందజేసి, సత్కరించారు.

రిటైర్డ్ తెలుగు అధ్యాపకుడు రామచంద్రారెడ్డి తెలుగు భాష తీయదనాన్ని వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శారదా కళాశాలలో..

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి జయంతిని పురస్కరించుకుని కళాశాలలు, గ్రంథాలయాల్లో గురువారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శారదా జూనియర్, డిగ్రీ కళాశాలల నందు విద్యార్థులకు మాదక ద్రవ్యాల నివారణపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం ఒక్క నిమిషం పాటు ఆంగ్ల పదాలు వాడకుండా తెలుగులోనే మాట్లాడడం వంటి పోటీలు నిర్వహించారు. విశ్రాంత తెలుగు అధ్యాపకులు వై.పూర్ణచంద్రరావు, పింగళి వెంకట కృష్ణారావులను ఘనంగా సత్కరించారు. కళాశాల తెలుగు అధ్యాపకురాలు ఎస్.శారద తెలుగు భాష గొప్పదనాన్ని వివరించారు. అనంతరం పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. కళాశాల కరస్పాండెంట్ రామనారాయణ, కార్యదర్శి వరప్రసాద్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.శ్రీధర్, శారదా కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.నాగేశ్వర శర్మ, వైస్. ప్రిన్సిపాల్ ఎ.దుర్గాప్రసాద్, పైడిపాటి ఉమానాథ శర్మ పాల్గొన్నారు.

రామ్మోహన గ్రంథాలయంలో..

బందరు రోడ్డులోని రామ్మోహన గ్రంథాలయంలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ కమిటీ సభ్యుడు గిడుగు వెంకట రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అవధాన మార్తాండ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కమిటీ అధ్యక్షుడు చింతలపూడి కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు దమ్మాల రామచంద్రరావు, 'చెన్నప్రగడ సదాశివరావు'(ఐక్యం), గ్రంథాలయ కమిటీ సభ్యులు పవన్, గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.



తెలుగుతల్లి, గిడుగు చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

మాతృభాషలోనే విద్యాబోధన జరగాలి

విజయవాడ కల్చరల్: మాతృభాషలోనే విద్యాబోధన జరగాలని ఎన్టీఆర్ లిటరేచర్, వెబ్‌సైట్ కమిటీ చైర్మన్ టీడీ జనార్దన్ అన్నారు. నవ్యాంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఆధ్వర్యంలో బందరురోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో గిడుగు రామూర్తి జయంతి వేడకలు, తెలుగు భాషా దినోత్సవం, భాషా వేత్తలకు పురస్కారాల సభను గురువారం నిర్వహించారు. టీడీ జనార్దన్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయాన్ని ఆంధ్రప్రదేశ్‌కు తరలించేలా కృషి చేస్తానని తెలిపారు. నూతన రాజధాని అమరావతిలో కళాభవన్ ఏర్పాటుకు సంబంధి శాఖ అధికారులతోనూ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొని వెళ్తానన్నారు, గిడుగు సేవలను నవ్యాంధ్ర రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి కలిమిశ్రీ కొనియాడారు. రాజధాని ఫైల్స్ నిర్మాత కంఠంనేని రవి శంకర్, గిడుగు రామ్మూర్తి ఫౌండేషన్ చైర్మన్ కాంతికృష్ణ, మాజీ మేయర్ తాడి శకుంతల, భాషా వేత్తలు డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లు, సంఘ సేవకులు కె.శ్రీనివాస గౌడ్ పాల్గొన్నారు. నవ్యాంధ్ర రచయితల సంఘం అధ్యక్షుడు బిక్కీ కృష్ణ చేతులమీదుగా గిడుగు జీవన సాఫల్య పురస్కారాలను, గిడుగు సాహిత్యసేవా పురస్కారాలను అందజేశారు.

తెలుగు భాష అభ్యున్నతికి గిడుగు కృషి

విజయవాడస్పోర్ట్స్: తెలుగు భాషాభివృద్ధికి గిడుగు వెంకటరామ్మూర్తి చేసిన కృషి అభినందనీయమని బెజవాడ బార్ అసోసియేషన్(బీబీఏ) అధ్యక్ష కార్యదర్శులు కొత్త చంద్రమౌళి, అరిగల శివరామప్రసాద్(రాజా) అన్నారు. తెలుగు భాషా దినోత్సవ కార్యక్రమాన్ని బీబీఏ హాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తి, తెలుగు తల్లి చిత్రపటాలకు న్యాయవాదులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీబీఏ అధ్యక్షకార్యదర్శులు మాట్లాడుతూ సామాన్యులకు సైతం అర్థమయ్యేలా వ్యవహారిక భాషలో తెలుగును గిడుగు రామ్మూర్తి తీర్చిదిద్ది ఆధునిక భాషా నిర్మాతల్లో ముఖ్యుడుగా కీర్తికెక్కారన్నారు.

మధురంగా సాగిన లయ విన్యాసం



విజయవాడ కల్చరల్: లయ కళానాద స్రవంతి సంగీత సంస్థ ఆధ్వర్యంలో సంగీత విద్వాంసులు లంకా వెంకటేశ్వర్లు సంస్మరణ సందర్భంగా ఐదు రోజుల పాటు నిర్వహించే సంస్మరణ సంగీతోత్సవాలు శివరామకృష్ణ క్షేత్రంలో గురువారం ప్రారంభమయ్యాయి. శాస్త్రీయ సంగీతానికి పెద్దపీట వేస్తూ కళాకారులు నిర్వహించిన గాత్ర కచేరీలు, లయ విన్యాసం, మృదంగ విన్యాసం ఆద్యంతం ఆకట్టుకున్నాయి. సంగీత విద్వాంసురాలు ఆర్.వి జయలక్ష్మి వయోలిన్‌పై సంప్రదాయ కీర్తనలను ఆలపించారు. నోరి లక్ష్మీ మనోజ, నోరి గాయత్రి వాగ్గేయకార కీర్తనలను గాయక సార్వభౌమ పారుపల్లి రామకృష్ణయ్య పంతులు సంగీత కళాశాల విద్యార్థులు నిర్వహించిన లయ విన్యాసం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమాలను సంస్థ నిర్వాహకురాలు కె.మాధవి నిర్వహించారు. పలువురు సంగీత విద్వాంసులు పాల్గొన్నారు.

గ్లోబల్ స్పోర్ట్స్ అవార్డులు అందజేత



విజయవాడస్పోర్ట్స్: జాతీయ క్రీడల్లో రాణించిన పలువురు రాష్ట్ర క్రీడాకారులకు గ్లోబల్ స్పోర్ట్స్ అవార్డులను ప్రదానం చేసినట్లు గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్ కార్యదర్శి జి.వి.ఎస్.ప్రసాద్ తెలిపారు. గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్, గ్లోబల్ స్పోర్ట్స్ మ్యాగజైన్ సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయ స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో రాణించిన క్రీడాకారులు అక్షయిదాయాం, తమన్యు, తన్యు, హేమంత్, మురారి, ధరణిధర్‌రెడ్డి, యశ్వంత్‌సూర్య, అభిలాష్, షణ్ముక్, ప్రజ్ఞ, ఆశ్రిత్, నాగభువనలతో పాటు అథ్లెటిక్స్ క్రీడాకారుడు సత్యనారాయణ, హాకీ క్రీడాకారిణి మోహనలక్ష్మీలకు ఈ అవార్డులను తాడిగడపలోని రైఫిల్ షూటింగ్ అకాడమీలో గురువారం అందజేశారు. మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి, జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ అవార్డులను ప్రదానం చేశామన్నారు. క్రీడలను ప్రోత్సహించేందుకు గత పదేళ్లుగా ఈ అవార్డులను అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో షూటింగ్ అకాడమీ డైరెక్టర్ ఎస్.సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఏపీ పోలీస్ శిక్షకులు గమిడి సాంబశివరావు పాల్గొన్నారు.

లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహిస్తే కఠిన చర్యలు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలో లైసెన్స్ లేకుండా వ్యాపారాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. ఈ మేరకు నగర పరిధిలోని 45వ డివిజన్ ఏరియాలో రోటరీ నగర్‌లోని ఐరన్ స్క్రాప్ వ్యాపారస్తులకు 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు నోటీసులు ఇచ్చి ట్రేడ్ లైసెన్స్ తీసుకోమని సూచించినప్పటికీ సదరు వ్యాపారస్తులు స్పందించకపోవటంతో వీఎంసీ అధికారులు చర్యలు చేపట్టారు. గురువారం కరీముల్లా ఐరన్ స్క్రాప్ బిజినెస్, ద్వారకా వీధిలోని నేత్ర ఎంటర్‌ప్రైజెస్ డిస్పోజల్ షాపులను వీఎంసీ అధికారులు సీజ్ చేశారు.

ట్రేడ్ లైసెన్స్‌లు తప్పనిసరి..

నగరంలో వ్యాపారం చేయాలనుకునే వారంతా ముందుగానే వీఎంసీ నుంచి ట్రేడ్ లైసెన్స్‌లు పొందాలని, ఇప్పటికీ పొందని వారు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటనే త్వరితగతిన వారికి లైసెన్స్‌లు మంజూరు చేస్తామని కమిషనర్ ప్రకటించారు. లైసెన్స్ లేని వ్యాపారస్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని చెప్పారు. వర్షాకాలం దృష్ట్యా నీటి కాలుష్యం వల్ల కలిగే డయేరియా, వాంతులు విరోచనాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో నగరంలోని ఆర్వో ప్లాంట్లు అన్నీ వారి నీటి శాంపిళ్లను ప్రతి నెల ప్రభుత్వ ల్యాబ్‌లో తనిఖీ చేయించి రిపోర్టును తమకు సమర్పించాలన్నారు. ఇంకా శాంపిళ్లను ల్యాబ్‌కు పంపని ప్లాంట్లను సీజ్ చేస్తామని హెచ్చరించారు.



షాప్‌ను సీజ్ చేస్తున్న వీఎంసీ అధికారులు

స్టేజ్ 3 నాలుక క్యాన్సర్‌కు విజయవంతంగా చికిత్స



లబ్బీపేట(విజయవాడ తూర్పు): తీవ్రస్థాయి నాలుక క్యాన్సర్‌తో బాధపడుతున్న 91 ఏళ్ల రోగికి విజయవాడలోని అమెరికన్ ఆంకాలజీ ఇన్‌స్టిట్యూట్‌లో విజయవంతంగా చికిత్స అందించినట్లు రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ సాయి స్నేహిత్ తెలిపారు. విజయవాడకు చెందిన సూరపనేని రాధాకృష్ణమూర్తి తన నాలుక కుడి వైపున పుండు ఉందని, అది నొప్పిని కలిగించడంతో పాటుగా తినేటప్పుడు మంటగా ఉంటుందనే సమస్యతో ఆస్పత్రికి వచ్చారన్నారు. అతని వయస్సు, క్యాన్సర్ దూకుడు స్వభావం కారణంగా ఆ కేసు చాలా సవాలుగా మారిందని తెలిపారు. అయినప్పటికీ అధునాతన సదుపాయాలు అందుబాటులో ఉండటంతో రేడియోథెరఫీ పద్ధతులతో దుష్ప్రభావాలను తగ్గించి, కణితిని లక్ష్యంగా చేసుకుని సమర్థవంతంగా చికిత్స అందించామన్నారు. అతను పురోగతి సాధించడం సంతోషంగా ఉందని డాక్టర్ సాయిస్నేహిత్ అన్నారు. సంక్లిష్ట క్యాన్సర్‌ను ఖచ్చితత్వంతో నిర్వహించేందుకు అధునాతన పరికరాలు అందుబాటులో ఉండటం వలనే విజయవంతంగా చికిత్స అందించగలిగామని ఆయన తెలిపారు.

ఉత్సాహంగా నేషనల్ స్పోర్ట్స్ డే వేడుకలు



మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, అధ్యాపకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం వ్యాయామ విద్య విభాగం ఆధ్వర్యాన నేషనల్ స్పోర్ట్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా క్రీడల ప్రాముఖ్యతను ఆమె వివరించారు. విద్యార్థులు విద్యకే పరిమితం కాకుండా క్రీడల్లో కూడా ప్రావీణ్యం పెంచుకోవాలని క్రీడల వల్ల మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల వ్యాయామ విద్య అధ్యాపకుడు డి.యుగంధర్, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

పాయకాపురం(విజయవాడరూరల్): జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం పుచ్చలపల్లి సుందరయ్య హైస్కూల్‌లో విద్యార్థులకు ఆటల పోటీలను నిర్వహించారు. కబడ్డీ, వాలీబాల్, త్రో బాల్ పోటీలను నిర్వహించి, గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ మైనం హుస్సేన్ మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమన్నారు. ప్రతి విద్యార్థి క్రీడల్లో రాణించి ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యాయామ క్రీడా ఉపాధ్యాయిని ఉమా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. తెలుగు భాషా దినోత్సవం గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరించుకొని హైస్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు.



విద్యార్థులకు బహుమతులు అందజేసిన హెచ్‌ఎం మైనం హుస్సేన్, ఉపాధ్యాయులు

ఎన్‌జీసీలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలి

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): హ్యాపీ లైఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం సత్యనారాయణపురంలోని ఏకేటీపీ హైస్కూల్‌లో నేషనల్ గ్రీన్ కార్ప్స్(ఎన్‌జీసీ) కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ మామిడి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులను పర్యావరణ సంబంధిత కార్యకలాపాల్లో భాగస్వాములు చేయడమే ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. పాఠశాల, ఇంటి పరిసర ప్రాంతాలలో మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం, పరిసరాల పరిశుభ్రత తదితర విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మధ్యాహ్నం భోజనం సమయంలో మిగిలిపోయిన ఆహారాన్ని డస్ట్‌బిన్లలో మాత్రమే వేసి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ప్రతి పాఠశాలలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయాలని సూచించారు. పాఠశాలలో కిచెన్ గార్డెన్‌కు కావలసిన ప్రదేశాన్ని ఎన్నుకొని ఆకుకూరలు, కూరగాయలు పండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం నేషనల్ గ్రీన్ కార్ప్స్ ఎకో క్లబ్ నూతన కమిటీని ఏర్పాటు చేసి విద్యార్థులకు టీ షర్ట్‌లు అందజేశారు. కార్యక్రమంలో హ్యాపీ లైఫ్ ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు దేవరపల్లి సురేష్, హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు శివ, డి.సీతారామారావు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఏకేటీపీ స్కూల్‌లో ఫౌండేషన్ సభ్యులు, విద్యార్థులు

నేడు లలితా సహస్రనామ ప్రాశస్త్యంపై ఉపన్యాసం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రా షిర్డీ ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం 6 గంటలకు ఆధ్యాత్మిక వేత్త వేముల హజరత్తయ్య గుప్తా లలితా సహస్రనామ ప్రాశస్త్యంపై ఉపన్యాసం చేస్తారని నిర్వాహకులు జేవీ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రావణ మాసంలో విశిష్టమైన లలితా సహస్రనామం గురించి ప్రజలందరికీ అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. భక్తులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నాడు అవమానించి.. నేడు కపట ప్రేమ ఒలకబోస్తున్నారు

ఏపీ నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పుల్లయ్య



భవానీపురం (విజయవాడ పశ్చిమ): సమస్యలను విన్నవించుకునేందుకు వస్తే తోకలు కత్తిరిస్తా.. మిమ్మల్ని దేవాలయాల్లో అడుగు పెట్టనివ్వను అంటూ నాడు నాయీబ్రాహ్మణులను ఘోరంగా అవమానించిన ప్రస్తుత సీఎం చంద్రబాబు నేడు వారికి అగ్రతాంబూలం ఇస్తున్నట్లు కపట ప్రేమ ఒలకబోస్తున్నారని ఏపీ నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ టి.పుల్లయ్య గురువారం ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో నాయీబ్రాహ్మణుల సంక్షేమం పట్ల చంద్రబాబుకు చిత్తశుద్ధి లేదన్నారు. దేవదాయ శాఖ పరిధిలో ఉన్న దేవాలయాల్లో పని చేస్తున్న నాయీబ్రాహ్మణులకు ఇప్పుడిస్తున్న రూ.20 వేల జీతాన్ని రూ.25 వేలకు పెంచుతున్నట్లు, దేవాలయాల పాలకమండళ్లలో స్థానం కల్పిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించటం విడ్డూరంగా ఉందని తెలిపారు. మాజీ సీఎం వైఎస్ జగన్ పాలనలోనే ఆలయాల్లో సేవకులైన నాయీబ్రాహ్మణులను పాలకులుగా చేశారన్న సంగతిని చంద్రబాబు మరిచిపోయినట్లున్నారని గుర్తు చేశారు. నాయీబ్రాహ్మణులను ఎండోమెంట్ ఉద్యోగులుగా పరిగణించి జీతాలు పెంచింది కూడా వైఎస్ జగనే అని చెప్పారు.